సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



**19న అప్పన్న కల్యాణోత్సవం**
వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని సింహాచలం ఈవో తెలిపారు. 8లో



**విధి నిర్వహణలో సంతృప్తి**
విశాఖలో విధుల నిర్వహణ తమకు ఎంతో సంతృప్తిని, ఆనందాన్నిచ్చిందని బదిలీ అయిన న్యాయమూర్తులు అన్నారు. 8లో



**దిశ దివ్యాంగ్ సురక్షకు 13 కాల్స్**
దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రవేశపెట్టిన కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. 8లో

# టీడీపీ విందు రాజకీయం

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని భావిస్తున్న టీడీపీ అభ్యర్థులు అడ్డదారులూ తొక్కుతున్నారు. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు విభజించు.. ఆతిథ్యమిచ్చు.. అనే సూత్రాన్ని అవలంబిస్తున్నారు. సామాజికవర్గాల వారీగా సహపంక్తి భోజనాలతో ఎరవేస్తున్నారు. ఆత్మీయ సమావేశాల పేరుతో ప్రత్యేక కూపన్లు పంపిణీ చేస్తూ.. డబ్బులు, గిఫ్ట్‌లు అందజేస్తూ ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో అయితే ప్రతి వీధినీ.. ఏకంగా మందుబాబులకు అడ్డాగా మార్చేస్తున్నారు. జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది.

- సహపంక్తి భోజనాలతో టీడీపీ నేతల వల
- తమ పరిధిలో సామాజికవర్గాల వారీగా ఆహ్వానం
- ఆత్మీయ సమావేశం పేరుతో ప్రత్యేక కూపన్ల పంపిణీ
- తూర్పులో మందు పార్టీలు నిర్వహిస్తున్న వెలగపూడి
- బూత్‌లో ఓట్ల మేరకు గంటా బేరసారాలు



సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలకు ఓటింగ్ దగ్గరపడుతున్నకొద్దీ టీడీపీ అభ్యర్థుల్లో ఆందోళన పెరిగిపోతోంది. ప్రచారాల్లో పార్టీకి పెద్దగా ఆదరణ లేకపోవడంతో బెంగ ఏర్పడుతోంది. దీంతో ఎలాగైనా ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదయం ఆయా నియోజకవర్గాల్లో స్థానికంగా ఉన్న సామాజికవర్గాల పెద్దలను పిలిచి తియ్యటి మాటలతో బోల్తా కొట్టిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ఆయా సామాజికవర్గాల వారీగా ఆత్మీయ విందుల పేరుతో వలవేస్తున్నారు. ఇంటికి వెళ్లే సమయంలో ప్రత్యేక కూపన్లు ఇస్తున్నారు. వీటితో నిత్యావసరాలు, మందు, ఫుడ్ కొనుగోలు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల్ని ఉల్లంఘిస్తూ టీడీపీ అభ్యర్థులు తమ అనుచరుల నివాసాలు, రిసార్టుల్లో ఈ తరహా పార్టీలు నిర్వహిస్తున్నారు.

**పోలింగ్ బూత్ వారీగా..**

భీమిలి, విశాఖ తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఉత్తర, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు ఈ తరహాలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఒకే చోటు ఎక్కువ మంది కూడితే ఎన్నికల కమిషన్‌కు అనుమానం వస్తుందని భావించి, పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఓటు ఉండి ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి బంధువుల ఓట్లు కొనుగోలుకూ బేరసారాలు మొదలు పెడుతున్నారు.

**గంటాది అదే పంథా**

భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు విశాఖ ఉత్తర నుంచి గతంలో పోటీ చేసినప్పుడు సైతం కులసంఘాలతో తరచూ సమావేశాలు నిర్వహించేవారు. ఇప్పుడు అదే పంథా కొనసాగిస్తూ గెలుపు కోసం ఎత్తుగడలు వేస్తున్నారు. అలాగే సామాజికవర్గాల వారీగా ఆ బూత్‌లో ఉన్న ఓట్ల మేరకు బేరసారాలు సాగిస్తున్నారు. విందు రాజకీయాల్లో ఆరితేరిన ఆయన బిర్యానీలు, స్వీట్ ప్యాకెట్లు, కూపన్లు అందిస్తూ ఓటర్లకు గాలం వేస్తున్నారు. ఆదివారం రాత్రి కొమ్మాది సమీపంలోని అన్నంరాజు లేఅవుట్ వద్ద పలువురికి మందు, విందు ఏర్పాటు చేశారు.

**తూర్పులో మద్యం కూపన్లు**

విశాఖను మద్యం మత్తులో దింపిన వెలగపూడి.. ఈ ఎన్నికల్లోనూ తన సిండికేట్ వ్యాపారమైన మద్యాన్నే నమ్ముకుంటున్నారు. మందుబాబులు ఎవరున్నారో.. తన అనుచరుల ద్వారా తెలుసుకొని.. ప్రతి రోజూ తనకు చెందిన బార్ల పేరుతో కూపన్లు అందిస్తున్నారు. ఇందుకోసం తన బార్లలో ప్రత్యేకంగా మద్యం నిల్వలు పెట్టుకున్నట్లు సమాచారం. బిర్యానీ, మందు బాటిల్ అందజేస్తూ ఓటర్లను వెలగపూడి ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఈసారి తూర్పులో ఎదురుగాలి తప్పదని భావించిన వెలగపూడి.. ప్రతి వీధినీ మద్యం మత్తులో జోగేలా చేయాలని కంకణం కట్టుకున్నారు. ప్రచారంలో తనతో పాటు వచ్చిన వారికి తన అనుచరుల సహాయంతో ఆయా బార్లు, మద్యం దుకాణాల వద్దకు తీసుకెళ్లి.. ఎవరికి ఎంత మేర కావాలో అందజేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ తరహా అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్న టీడీపీ అభ్యర్థులను జనం చీదరించుకుంటున్నారు.

# కొత్త ఓటర్లు 49,083

- ముగిసిన ఓటరు నమోదు ప్రక్రియ
- పెండింగ్ దరఖాస్తులకు వారం రోజుల్లో పరిష్కారం
- 24న ఓటర్ల తుది జాబితా ఖరారు చేయనున్న ఎన్నికల కమిషన్



| | |
|---|---|
| మొత్తం దరఖాస్తులు | 72,376 |
| ఆమోదించినవి | 49,083 |
| తిరస్కరించినవి | 12,761 |
| పెండింగ్‌లో ఉన్నవి | 10,532 |

మహారాణిపేట: కొత్తగా ఓటు హక్కు నమోదుకు ఈసీ ఇచ్చిన గడువు ఆదివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 70 వేలకు పైగా ప్రజలు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 49 వేల మందికి ఓటు హక్కు కల్పించారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుండటంతో తుది ఓటర్ల జాబితాను ఈ నెల 24న విడుదల చేసేందుకు ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది.

సంక్షేమ పాలన, విశాఖ సమగ్రాభివృద్ధి కొనసాగించేందుకు సమర్థవంతమైన నాయకుడిని మరోసారి ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుంది. ఆ బాధ్యత పొందాలంటే ప్రతి పౌరుడికీ ఓటు హక్కు తప్పనిసరి. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు కావడానికి ఎన్నికల సంఘం ఇచ్చిన తుది గడువు ఆదివారంతో ముగిసింది. జిల్లా యంత్రాంగం ఓటు నమోదుపై పెద్ద ఎత్తున చేసిన ప్రచారం సఫలీకృతమైంది. ఈ ఏడాది జనవరి 23 నుంచి ప్రారంభమైన ఈ క్రతువులో కొత్తగా ఓటు హక్కు నమోదు పొందేందుకు 72,376 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 49,083 మందికి ఓటు హక్కు కల్పించగా, 12,761 మంది దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తిరస్కరించారు. మిగిలిన 10,532 దరఖాస్తుల పరిశీలనను వారం రోజుల్లోనే పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం శ్రమిస్తోంది. ఫారం-8 ద్వారా ఓటులో మార్పు చేర్పులకు కూడా పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 17,180 వరకు ఫారం-8 దరఖాస్తులు రాగా.. 12,933 దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. 2,339 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 1,908 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

**నియోజకవర్గాల వారీగా ఫారం-6 ద్వారా నమోదైన కొత్త ఓట్లు**

| నియోజకవర్గం | వచ్చిన దరఖాస్తులు | కొత్తగా చేరిన ఓటర్లు | తిరస్కరణకు గురైనవి |
|---|---|---|---|
| భీమిలి | 10,170 | 7,131 | 1,201 |
| విశాఖ తూర్పు | 17,252 | 11,424 | 3,931 |
| విశాఖ దక్షిణ | 6,862 | 5,266 | 669 |
| విశాఖ ఉత్తర | 13,111 | 8,703 | 2,562 |
| విశాఖ పశ్చిమ | 7,355 | 4,467 | 1,579 |
| గాజువాక | 9,935 | 6,451 | 1,897 |
| పెందుర్తి | 7,691 | 5,641 | 922 |
| మొత్తం | 72,376 | 49,083 | 12,761 |

**నియోజకవర్గాల వారీగా ఫారం-8 ద్వారా జరిగిన మార్పులు చేర్పులు**

| నియోజకవర్గం | వచ్చిన దరఖాస్తులు | మార్పులు చేసినవి | తిరస్కరణకు గురైనవి |
|---|---|---|---|
| భీమిలి | 2,441 | 1,808 | 250 |
| విశాఖ తూర్పు | 4,883 | 4,005 | 453 |
| విశాఖ దక్షిణ | 826 | 609 | 118 |
| విశాఖ ఉత్తర | 2,416 | 1,666 | 473 |
| విశాఖ పశ్చిమ | 1,874 | 1,059 | 583 |
| గాజువాక | 2,789 | 2,248 | 245 |
| పెందుర్తి | 1,951 | 1,538 | 217 |
| మొత్తం | 17,180 | 12,933 | 2,339 |

## న్యూస్‌రీల్

### దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా పోలింగ్ బూత్‌లను కింది అంతస్తులో ఏర్పాటు చేశామని, ర్యాంప్ సౌకర్యం కూడా కల్పించామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వివరించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు ఎన్నికల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఓటు వేయడానికి తీసుకున్న చర్యలను వివరించారు. వీల్ చైర్స్ కూడా ఏర్పాటు చేస్తామని, అంధులకు బ్రెయిలీ లిపిలో ఓటర్ గుర్తింపు స్లిప్‌ను, బ్యాలెట్ పేపర్‌ను అందిస్తామని కలెక్టర్ వివరించారు. 40 శాతం కంటే ఎక్కువ దివ్యాంగత్వం కలిగిన వాళ్లకి, 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఫారం12 డీను బీఎల్‌వో/ఏఈఆర్‌వో/ఈఆర్‌వోలకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, డీఈవో ఎల్.చంద్రకళ, సీపీడబ్ల్యూడీ ఏఈ బి.సతీష్, ప్రిన్సిపాల్ ఎ.తిరుమల ప్రసాద్, జిల్లా బధిరుల సంఘ అధ్యక్షుడు పి.షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



కాలర్‌తో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: డయల్ యువర్ సీపీకి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణమే చట్టప్రకారం పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీపీ తన ఛాంబర్ నుంచి డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 37 మంది కాల్ చేసి తమ సమస్యలను సీపీకి విన్నవించారు. అలాగే మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం కేటాయించిన సమయంలో 8 మంది ఫోన్ చేసి ఫిర్యాదులు చేశారు. వారందరి సమస్యలు తెలుసుకున్న సీపీ వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వాటిని సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. ఈ నెల 1వ తేదీన నిర్వహించిన డయల్ యువర్ సీపీకి వచ్చిన 4 ఫిర్యాదుల్లో మూడు పరిష్కారమైనట్లు సీపీ తెలిపారు. ఒకటి సివిల్ పరిధిలో ఉండడంతో కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగపతి, ఉపాధ్యక్షుడు వి.శ్యామల పాల్గొన్నారు.

### ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం

విశాఖ సిటీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం, ఇతర అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. రెవెన్యూ అధికారులు చేసిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకొనేలా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నామని డీసీపీలు తెలిపారు. సజావుగా ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### నేటి నుంచి హైదరాబాద్‌కు మరో విమానం

గోపాలపట్నం: విశాఖ నుంచి హైదరాబాద్‌కు రాత్రిపూట మరో విమాన సర్వీసు మంగళవారం అందుబాటులోకి రానుంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం హైదరాబాద్ నుంచి ప్రతీ రోజు రాత్రి 9.35 గంటలకు బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి 11 గంటలకు చేరుకుంటుంది. తిరిగి విశాఖ నుంచి రాత్రి 11.40 గంటలకు బయలుదేరి రాత్రి 1.50 గంటలకు చేరుకుంటుందని విమానయాన సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

# క్రీడాకారులకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి

- విశాఖలో అత్యాధునిక సదుపాయాలతో సరికొత్త స్టేడియం
- క్రీడాకారుల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

బీచ్‌రోడ్డు : క్రీడలతో ఉజ్వల భవిష్యత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా గౌరవం పెరుగుతుందని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి అన్నారు. సోమవారం వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో క్రీడాకారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ఆడుదాం-ఆంధ్ర పేరుతో గ్రామ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించారన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే విశాఖలో ప్రతీ నియోజకవర్గంలో ఒక స్పోర్ట్స్ స్టేడియం ఉండేలా చర్యలు తీసుంటామని తెలిపారు. విజన్ విశాఖలో భాగంగా లక్ష మంది సామర్థ్యం కలిగిన అత్యాధునిక సదుపాయాలతో కూడిన సరికొత్త స్టేడియం నిర్మించేందుకు ఇప్పటికే ప్రణాళికలను రూపొందించినట్లు పేర్కొన్నారు. తాను ఎంపీ అయితే క్రీడాకారులకు స్థానిక, కేంద్ర సంస్థల్లో స్పోర్ట్స్ కోటా ఇచ్చే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మహిళా అధ్యక్షురాలు కృపారాణి, ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి రవిరాజు, విశాఖపట్నం వెయింట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సూర్యనారాయణ, డి.రామకృష్ణరెడ్డి, మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

# బొత్స ఝాన్సీకి అడుగడుగునా బ్రహ్మరథం



మంథావారి వీధిలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్



జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనందకుమార్

మహారాణిపేట: వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. విశాఖ దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల్లో సోమవారం బొత్స ఝాన్సీ ఎన్నికల ప్రచారం చేపట్టగా.. అడుగడుగునా ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. విశాఖ దక్షిణలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలసి ఆమె విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తాడి వీధి నుంచి ప్రారంభమైన ప్రచారం మానస హోటల్, లేపాక్షి మెయిన్ రోడ్, ఆంజనేయస్వామి ఆలయం, రజకవీధి, మంథావారి వీధి, వార్డు బాయ్స్ కాలనీ, కేజీహెచ్ నుంచి కలెక్టర్ ఆఫీసు, అఫీషియల్ కాలనీ మీదుగా జాలారిపేట మెయిన్ రోడ్, కోడి పందాల వీధి, ఎగువ రెల్లి వీధి, అంబేడ్కర్ విగ్రహం వద్ద ముగిసింది. ప్రజలే తమ బలమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని 89వ వార్డు కొత్తపాలెంలో పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్‌తో కలిసి బొత్స ఝాన్సీ ప్రచారం నిర్వహించారు. కొత్తపాలెం హైస్కూల్‌కు వెళ్లే రోడ్డు నుంచి పీఏసీఎస్ కార్యాలయం వరకు సాగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించారు.

# రౌడీ సేన

- పెందుర్తి నియోజకవర్గంలో చెలరేగిపోతున్న జనసేన నాయకులు
- కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అండతో భౌతిక దాడులు
- నాడు చింతగట్లలో వైఎస్సార్‌సీపీ నేత కనకరాజుపై హత్యాయత్నం
- తాజాగా టీడీపీ కార్పొరేటర్ ముత్యాలనాయుడుపై విచక్షణరహితంగా దాడి
- 2009–2014 మధ్య దందాలు, రౌడీయిజంతో చెలరేగిన పంచకర్ల అనుచరులు

**2023** నవంబర్ 12. పెందుర్తి మండలం చింతగట్లలో ప్రజలందరూ దీపావళి సంబరాల్లో ఉన్నారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో చింతగట్ల సర్పంచ్ భర్త, రాష్ట్ర అయ్యారక వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజుపై జనసేన నాయకులు, కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అనుచరులు రెచ్చిపోయారు. బీరు బాటిళ్లు, పదునైన ఆయుధాలు పట్టుకుని కనకరాజును హతమార్చేందుకు తల, శరీరంపై దాడికి పాల్పడ్డారు. స్థానికులు స్పందించి రక్తపు మడుగులో ఉన్న కనకరాజును హుటాహుటిన ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. నిందితులైన జనసేన నాయకులు మాడిశ హరీష్, చందక గోవిందరాజు, దాసరి గణేష్‌లను పెందుర్తి పోలీసులు ఈ ఏడాది ఏప్రిల్ 2న అరెస్ట్ చేశారు.

**2024** ఏప్రిల్ 14. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని సతివానిపాలెంలో ఓ విందు కార్యక్రమం జరుగుతోంది. విందుకు టీడీపీ స్థానిక కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు హాజరయ్యారు. అదే సమయంలో జనసేన స్థానిక నాయకుడు, పంచకర్ల రమేష్ అనుచరుడు గల్లా శ్రీనివాసరావు కూడా అక్కడికి వచ్చాడు. అకారణంగా ముత్యాలనాయుడును బూతులతో దూషించాడు. ఇది శుభకార్యం.. ఇక్కడ గొడవెందుకు అని ముత్యాలనాయుడు వారించినా వినిపించుకోలేదు. ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా ముత్యాలనాయుడును ఇష్టానుసారం కొట్టాడు గల్లా శ్రీను. దీంతో స్థానికులు వచ్చి అడ్డుకోవడంతో ముత్యాలనాయుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. బాధిత కార్పొరేటర్ పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు.



పంచకర్ల అనుచరులు చందక గోవింద్, మాడిశ హరీష్ చేతిలో హత్యాయత్నానికి గురైన కనకరాజు

పెందుర్తి నియోజకవర్గ జనసేన నాయకులు, కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు అనుచరుల రౌడీయిజం పెచ్చుమీరుతోంది. తమకు నచ్చని వారిపై హత్యాయత్నాలు, భౌతిక దాడులకు పాల్పడుతున్నా రు. ఎక్కడికక్కడ 'సైకో'తనంతో వీరంగం సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ప్రత్యర్థులను సోషల్ మీడియా వేదికగా అసభ్యపద జాలంతో దూషిస్తున్నారు. కులాల పేరుతో వేధిస్తున్నారు. 'మేం వస్తే మీ సంగతి తేలుస్తాం'అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.

**నచ్చకపోతే అంతే..**

పెందుర్తిలోని జనసేన నాయకులు తమకు అనుకూలంగా లేని వారిపై భౌతిక దాడులకు పాల్పడడం అత్యంత సహజంగా మారింది. ఇందుకు ఆదివారం సతివానిపాలెంలో జరిగిన ఘటనే నిదర్శనం. తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి వర్గం. మొదటి నుంచి కూటమి అభ్యర్థిగా పంచకర్ల రమేష్ బాబును వ్యతిరేకిస్తున్న బండారు సత్యనారాయణ మూర్తి బాటలోనే ముత్యాలనాయుడు నడుస్తున్నాడు. పంచకర్ల రమేష్‌కు మద్దతు ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో కొద్దిరోజులుగా రమేష్‌బాబు అనుచరుడు గల్లా శ్రీను ముత్యాలనాయుడుపై సోషల్ మీడియా వేదికగా దూషణలు చేస్తున్నాడు. ప్రజాప్రతినిధి అని చూడకుండా ఏకంగా దాడికే పాల్పడ్డాడు. ఇదే తరహాలో చింతగట్లలో గనిశెట్టి కనకరాజుపై స్థానిక జనసేన నాయకులు చందక గోవింద, మాడిస హరీష్‌లు హత్యాయత్నానికి పాల్పడ్డారు.

**గతంలోనూ అంతే..**

పెందుర్తి ప్రజలకు ఎవరో కూడా తెలియని పంచకర్ల రమేష్‌బాబు 2009లో ప్రజారాజ్యం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అప్పుడు త్రిముఖ పోటీ కావడంతో పంచకర్ల రమేష్‌బాబు బొటాబొటి మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ప్రజారాజ్యాన్ని కాంగ్రెస్‌లోకి విలీనం చేసిన తర్వాత పంచకర్ల కూడా అందులో చేరిపోయారు. అధికార పార్టీలోకి వెళ్లిన వెంటనే పంచకర్ల, అతని అనుచరుల అసలు రూపం బయటకు వచ్చింది. అప్పటి వరకు స్తబ్దుగా ఉన్న రమేష్‌బాబు, అతని అనుచరులు ఒక్కసారిగా రెచ్చిపోయారు. అధికారులను తమ దారికి తెచ్చుకుని రౌడీయిజంతో పాటు భూ కబ్జాలకు పాల్పడ్డారు. ముఖ్యంగా నియోజకవర్గం కేంద్రం పెందుర్తి కేంద్రంగా ఎన్నో దందాలకు పాల్పడ్డారు. ఆ సమయంలో పంచకర్ల అనుచరుడు ఒకడు ఏకంగా పోలీసుల భూమికే గురి పెట్టాడు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పోలీస్ క్వార్టర్ల నిర్మాణానికి కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అనుచరుడు గొర్లె అప్పారావు దానిపై కన్నేశాడు. తప్పుడు డాక్యుమెంట్‌లు సృష్టించి ఏకంగా పోలీసులకు కేటాయించిన స్థలాన్నే ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేశాడు. దీంతో అప్రమత్తమైన అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ అప్పారావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి ఆట కట్టించారు. 2011 నుంచి 2014 వరకు పంచకర్ల అనుచరులు భూ కబ్జాలకు పాల్పడ్డంతో పాటు రౌడీ వేషాలు షరామామూలే అన్నట్లు జరిగేవి. అప్పట్లో రమేష్‌బాబు పేరు చెప్పుకుని సెటిల్‌మెంట్‌లు చేయడం, బెదిరింపులకు పాల్పడ్డం వంటి ఘటనలు కోకొల్లలు. పంచకర్ల స్థానికేతురుడు కావడంతో స్థానికంగా ఉన్న అనుచరులతో పాటు ఎక్కడెక్కడి నుంచో వచ్చిన అతని మనుషులు ఇక్కడి తరచూ అలజడి సృష్టించేవారు. ఒకరకంగా చెప్పాలంటే పెందుర్తి నియోజకవర్గంలో రౌడీయిజం పెచ్చుమీరింది పంచకర్ల రమేష్‌బాబు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అని రాజకీయ విశ్లేషకుల ఉవాచ.

– పెందుర్తి



88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడుపై దాడి చేసిన గల్లా శ్రీనివాసరావు(జేబులో నలుపు రంగు ఫోన్ ఉన్న వ్యక్తి)తో కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, చిత్రంలో కనకరాజుపై దాడి చేసిన నిందితుడు కూడా ఉన్నాడు.

## ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినహాయింపు లేదు

**డీఆర్వో మోహన్‌కుమార్**



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

మహారాణిపేట: తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయి.. ఆర్డర్లు తీసుకున్న వారంతా ఎన్నికల విధులకు తప్పకుండా హాజరుకావాల్సిందేనని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ తేల్చి చెప్పారు. తొలి విడత శిక్షణకు హాజరుకాని వారు తగిన కారణాలు తెలిపాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఓపీవోలుగా విధులు కేటాయించిన వారంతా మంగళవారం సాయంత్రం నాటికి ఫారం 12 పత్రాలు సమర్పించాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం పోలింగ్ పర్సనల్ నోడల్ అధికారి రవీంద్ర, ఎన్‌ఐసీ విభాగ అధికారులతో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన వారంతా వారికి కేటాయించిన విధులకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బంది అవసరాలను దృష్టిలో ఉంచుకుని ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో ఇంకెవరికీ మినహాయింపులు ఉండబోవన్నారు. ఇప్పటికే ఆర్డర్లు తీసుకున్న వారిలో 1,086 మంది ఎకనాలెజ్మెంట్ సమర్పించాలన్నారు. సమావేశంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు


మన గుర్తు ఫ్యాన్: ప్రచారంలో భాగంగా ఫ్యాన్ గుర్తు చూపిస్తున్న తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ


విజయీభవ: ఏఎస్ఆర్ నగర్‌లో ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు తిలకం దిద్దుతున్న మహిళ


అండగా ఉంటా.. ఆదరించండి: చంద్రంపాలెంలో దివ్యాంగుడికి కరపత్రం అందిస్తున్న భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి


పూలవర్షం: పి.బొనంగిలో పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్‌పై పూలవర్షం కురిపించిన అభిమానులు


అభిమాన హారతి: 71వ వార్డు తోకాడలో గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌కు హారతి ఇస్తున్న మహిళ

## విశాఖలో పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చింది


హాజరైన న్యాయవాదులు

- బదిలీ అయిన న్యాయమూర్తులకు ఘన సత్కారం

విశాఖ లీగల్: విశాఖలో విధుల నిర్వహణ తమకు ఎంతో సంతృప్తిని, ఆనందాన్నిచ్చిందని ఇక్కడి నుంచి బదిలీ అయిన పలువురు న్యాయమూర్తులు అన్నారు. తమకు సహకరించిన న్యాయవాదులకు, సహచర న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. విశాఖ న్యాయవాదుల గ్రంథాలయంలో సోమవారం విశాఖ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బదిలీ అయిన న్యాయమూర్తుల వీడ్కోలు సభ జరిగింది. విశాఖలో పనిచేయడం ఓ అనుభూతి అని పూర్వ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సిరిపుర శ్రీదేవి అన్నారు. న్యాయమూర్తి స్థాయికి చేరాలనే ఆకాంక్షతో ప్రతి రోజూ 10 కిలోమీటర్ల మేర నడిచి రోజులను ఆమె సోదరుడు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సిరిపురపు కృష్ణమోహన్ వివరించారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అధ్యక్షతన మాట్లాడారు. న్యాయమూర్తుల అనుభవాలు.. న్యాయవాదులకు వృత్తి ఎదుగుదలలో మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. న్యాయమూర్తులు తమ నూతన స్థానాల్లో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి సత్యనారాయణ న్యాయమూర్తుల సేవలను కొనియాడారు. బదిలీ అయిన న్యాయమూర్తులు ఎం.శ్రీహరి, లాలం శ్రీధర్, సిహెచ్ వివేకానంద, టీవీ రాజేష్, సీనియర్ న్యాయవాదులు మాధవరావు, కర్రి ఆదిబాబు, సుమన్, చింతపల్లి రాంబాబు తదితరులు ప్రసంగించారు. అనంతరం న్యాయమూర్తులందరినీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి దంతి నరేష్, ఉపాధ్యక్షుడు ఇమంది శ్రీనివాసరావు, అడపా సుధాకర్, ఆడారు అప్పారావు, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా జగన్నినాదం


నాతవరం సభకు హాజరైన భారీ జనం


సభలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

- మన విజయాన్ని ఎవరూ ఆపలేరు
- సంక్షేమ లబ్ధి పొందిన ప్రతి ఒక్కరి గుండెల్లో జగన్
- నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.1,700 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

నాతవరం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధి నాతవరం మండలంలో ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరిట ఏర్పాటు చేసిన ప్రతీ పథకం జగన్ ఆలోచనలో భాగం అని తెలిపారు. విద్యా, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ అమలు చేస్తే, ఆ తర్వాత చంద్రబాబునాయుడు పూర్తిగా నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. మరలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు చికిత్సల ఖర్చు పరిమితి పెంచారన్నారు. రాష్ట్రంలో 15 వేల గ్రామ సచివాలయాలు, 10 వేల ఆర్బీకేలు, 10 వేల హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే సేవలందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో కూటమి పేరుతో వస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన ప్రతి ఒక్కరి గుండెల్లో జగన్ ఉన్నంత కాలం వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.1,700 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు చేశామన్నారు. మరలా ఎమ్మెల్యేగా పెట్ల ఉమాశంకర్ గణేష్ గెలిపిస్తే మరింత అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ఎంపీ అభ్యర్థిగా అతిసామాన్య వ్యక్తి బూడి ముత్యాలనాయుడు కాగా, కూటమి నుంచి ఇతర జిల్లా నుంచి సంపన్న వ్యక్తిని దిగుమతి చేసుకున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా అభివర్ణించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు.

**ఇది సామాన్యులకు, పెత్తందారులకు పోటీ**

పార్లమెంట్ అభ్యర్థి ముత్యాలనాయుడు మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రెండు సార్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించారన్నారు. తనపై పోటీ చేసేందుకు ఈ ప్రాంతంలో ఎవరూ లేనట్లుగా ఎక్కడ నుంచో దిగుమతి చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నాతవరంలో ఎన్నికల ప్రచారం విజయోత్సవ ర్యాలీగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మంచి వ్యక్తిగా పేరున్న ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్‌ను మంచి మెజార్టీలో గెలిపించాలన్నారు.

**దోపిడీ అయ్యన్నకు ఓటుతో బుద్ధి చెప్పాలి...**

టీడీపీలో కార్యకర్తలను, నాయకులను నిరంతరం దూషించే అయ్యన్న ప్రజలకు ఏం మేలు చేశారో తెలపాలని ఎమ్మెల్యే గణేష్ డిమాండ్ చేశారు. అతని కుమారుడు విజయ్ గ్రామాల్లో తిరుగుతూ నోటికొచ్చినట్లు దూషిస్తున్నారన్నారు. ప్రతీ సారి పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారం చేయడం తప్ప ఏనాడూ సీటు పొందలేని దౌర్భాగ్యం దాపురించిందని ఎద్దేవా చేశారు. డబ్బులు కోసమే ఎంపీ సీటు తనదని ప్రచారం చేసి వచ్చిన వారి నుంచి ముడుపులు దండుకోవడం ఆనవాయితీగా మారిందని దుయ్యబట్టారు. అవినీతి అయ్యన్నకు ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, పార్టీ సీనియర్ నాయకుడు బోళెం నర్సింహమూర్తి, డీసీసీబీ డైరెక్టర్ అంకిరెడ్డి పార్వతి, డాక్టరు లక్ష్మీకాంత్, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టర్ పైల పోతురాజు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, నియోజవర్గ స్థాయి నాయకులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌పై దాడి హేయమైన చర్య

విశాఖ లీగల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన దాడి అత్యంత హేయమైన చర్య వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నేతలు అన్నారు. నగరంలో సోమవారం న్యాయవాదులు సమావేశమయ్యారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బాజీ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జోనల్ ఇన్‌చార్జి జీఎం రెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కాళిదాసు రెడ్డి, పాక సత్యనారాయణ పాల్గొన్నారు.

## దిశ దివ్యాంగ్ సురక్షకు 13 కాల్స్

విశాఖ సిటీ: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రవేశపెట్టిన కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. దిశ దివ్యాంగ్ సురక్ష టోల్ ఫ్రీ నంబర్‌కు మొత్తం 13 మంది దివ్యాంగులు తమ సమస్యలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌కు విన్నవించుకున్నారు. సోమవారం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు సీపీ తన చాంబర్ నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలితో సీపీ ఫిర్యాదులు తీసుకున్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీపీని పలువురు దివ్యాంగులు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. కేవలం విశాఖ నుంచే కాకుండా, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి బాధితులు తమ సమస్యలను తెలియజేశారు. వీటన్నింటినీ సంబంధిత అధికారుల దృష్టికి రాతపూర్వకంగా, పోస్టల్, వాట్సాప్ ద్వారా తీసుకువెళతానని సీపీ తెలిపారు. సమస్యలు పరిష్కరమయ్యేలా చర్యలు తీసుకోవాలని దిశ దివ్యాంగ్ సురక్ష కంట్రోల్, ఇతర సిబ్బందిని పర్యవేక్షించడానికి నియమించిన ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.

## రూ.2.18 లక్షల నగదు పట్టివేత


నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

తగరపువలస: వెంకటేశ్వరమెట్ట వద్ద చెక్‌పోస్టులో సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.2,18,000 నగదును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భీమిలి మండలం శింగనబంధ పంచాయతీ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ పరిపాలన విభాగానికి చెందిన భాను అనే వ్యక్తి ఈ నగదు తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఎన్నికల అధికారులు సీజ్ చేశారు.

## రసవత్తరంగా అంతర వైద్య కళాశాలల క్రీడా పోటీలు

ఏలూరు రూరల్: ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ అంతర కళాశాలల మహిళల ఆటల పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆశ్రం చైర్మన్ గోకరాజు గంగరాజు, జి.రతీదేవి, ఆశ్రం మెడికల్ డైరెక్టర్ కె.అంజిరెడ్డి సీఈఓ కె.హనుమంతరావు, సూపరింటెండెంట్ కె.శాంతయ్య షీల్డ్, మెడల్స్ అందజేశారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. వాలీబాల్‌లో విజయనగరం ఎంఐఎంస్ జట్టు ప్రథమస్థానం, గుంటూరు మెడికల్ కాలేజ్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. బాస్కెట్‌బాల్‌లో డాక్టర్ పిన్నమనేని సిద్దార్ధ మెడికల్ కళాశాల ప్రథమస్థానం, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో ఆశ్రం మెడికల్ కాలేజీ ప్రథమ స్థానం, రాజమండ్రి జీఎస్ఎల్ కాలేజీ రెండో స్థానం, త్రోబాల్‌లో రాజమండ్రి జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ప్రథమ, విశాఖపట్నం ఎన్ఆర్ఐ కాలేజ్ ద్వితీయ, బాల్ బ్యాడ్మింటన్‌లో ఆశ్రం మెడికల్ కాలేజీ ప్రథమ, అనిల్ నీరుకొండ డెంటల్ కాలేజీ రెండో స్థానం, టేబుల్ టెన్నిస్‌లో శ్రీకాకుళం గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ ప్రథమ, విశాఖపట్నంకు చెందిన గాయత్రి హెల్త్‌కేర్ కళాశాల ద్వితీయ స్థానం, టెన్నిస్ విభాగంలో విశాఖపట్టణం ఎన్ఆర్ఐ కళాశాల ప్రథమ, చిన్నకాకాని ఎన్ఆర్ఐ కళాశాల ద్వితీయ, చెస్‌లో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల జట్టు ప్రథమ, రాజమండ్రి జీఎస్ఎల్ కళాశాల జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

# 19న అప్పన్న వార్షిక కల్యాణోత్సవం

- పలు శాఖల అధికారులతో ఈవో సమీక్ష
- ఆరోజు రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు భక్తులకు ఉచిత దర్శనం


ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు, దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి రథోత్సవం, వార్షిక కల్యాణోత్సవాన్ని అన్ని శాఖల సమన్వయంతో వైభవంగా నిర్వహిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆయా శాఖల అధికారులతో సోమవారం సింహగిరిపై ఉన్న కల్యాణ మండపంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రథోత్సవం, కల్యాణోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. 19న రాత్రి 8.30 గంటల నుంచి రథోత్సవం, 10.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం ప్రారంభమవుతుందన్నారు. భక్తుల కోసం మంచినీరు, మజ్జిగ సదుపాయం కల్పిస్తామన్నారు. రెండు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. సింహగిరిపై అన్నదాన భవనంలో భక్తులకు ప్రత్యేకంగా భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలను ప్యాకెట్ల రూపంలో ప్రసాద విక్రయశాల వద్ద ఉన్న కౌంటర్లలో అందిస్తామన్నారు. 19న సాయంత్రం మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. తిరిగి రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు స్వామి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆ సమయంలో భక్తులకు ఉచిత దర్శనం ఉంటుందన్నారు. జీవీఎంసీ, దేవస్థానం సంయుక్తంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. రథోత్సవం, కల్యాణోత్సవంలో భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం పోలీస్ అధికారులతో కలిసి సింహగిరిపై ఏర్పాట్లను పరిశీలించారు. లా అండ్ ఆర్డర్ డీసీపీ-2 సత్తిబాబు, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, గోపాలపట్నం సీఐ సురేష్, జీవీఎంసీ, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శివుని ఆజ్ఞ వల్లే ఇక్కడకు వచ్చా..

- తల్లిదండ్రులు, గురువును మించిన దైవం లేదు
- 50 పడకల ఆస్పత్రి శంకుస్థాపనలో సినీ నటుడు సుమన్


నటుడు సుమన్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న ధర్మకర్త శర్మ

నాతవరం: దైవ సంకల్పంతోనే తాను ఈ స్థాయిలో ఉన్నానని సినీ నటుడు సుమన్ అన్నారు. మండలంలోని చిక్కుడుపాలెం గ్రామంలో గల శ్రీశివశక్తి క్షేత్రంలో ధర్మకర్త కె.ఎస్.ఎస్.శర్మ ఆధ్వర్యంలో సోమవారం 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి సుమన్ శంకుస్థాపన చేశారు. సుమన్‌కు వేదపండితులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.3 కోట్ల వ్యయంతో 85 సెంట్ల విస్తీర్ణంలో నిర్మించే 50 పడకల ఉచిత ఆస్పత్రి నిర్మాణానికి సుమన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శివుడి ఆజ్ఞ లేనిదే మానవుడు ఏమీ చేయలేడన్న అపారమైన నమ్మకం శివభక్తుడిగా తనకు ఉందన్నారు. ఈ రోజు తనకు చెన్నైలో అనేక కార్యక్రమాలు ఉన్నప్పటికీ ఇక్కడికి వచ్చానంటే శివుడి ఆజ్ఞే కారణంగా భావిస్తున్నానన్నారు. తాను హైదరాబాద్‌లో సినిమా షూటింగ్‌లో ఉండగా శివాలయం ధర్మకర్త శర్మ ఉచిత ఆస్పత్రి నిర్మిస్తున్నామని, శంకుస్థాపనకు రావాలని ఆహ్వానించారన్నారు. మారుమూల ప్రాంత ప్రజలకు ఉచిత వైద్యం అందించే మంచి కార్యక్రమానికి తన వంతు తోడ్పడాలని నిర్ణయించుకున్నాను అన్నారు. తన స్నేహితులు, సినిమా పరిశ్రమలో ఉన్న శివభక్తుల దృష్టికి ఈ ఆస్పత్రి విషయం తీసుకెళ్లి వారి ఆశీస్సులు కోరతానన్నారు. విదేశాల్లో ఉన్న వారు సైతం ఇలాంటి సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలంటే సెలబ్రిటీలు ఇలాంటి కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలన్నారు. ప్రతి వ్యక్తి దైవం లాంటి తల్లిదండ్రులు, గురువులను మరిచిపోకూడదన్నారు. ఇతర దేశాలతో పోల్చుకుంటే మన దేశంలో భక్తిభావం అధికమని, అందువల్లే ఇక్కడ యుద్ధాలు లేకుండా ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఉక్రెయిన్, రష్యా వంటి దేశాల్లో యుద్ధాల కారణంగా ప్రతి రోజు మరణాలు నమోదు అవుతున్నాయన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, అందువల్ల ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు.

**750 సినిమాల్లో నటించాను..**

తాను సినిమా పరిశ్రమలో అడుగు పెట్టి 46 ఏళ్లు అయిందన్నారు. ఇంత వరకు వివిధ భాషల్లో 750 సినిమాల్లో నటించానన్నారు. తెలుగులో 100 సినిమాల్లో హీరోగా నటించానని, తమిళంలో 50 సినిమాలు, కన్నడ తదితర భాషల్లో నటించానన్నారు. తెలుగు సినిమాల్లో అన్నమయ్య సినిమా జీవితాంతం గుర్తుండిపోయేలా చేసిందన్నారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో 8 నెలల పాటు కుటుంబానికి దూరంగా ఉంటూ చెప్పులు వేసుకోకుండా ప్రతిరోజు చన్నీళ్ల స్నానం చేశానన్నారు. దైవ స్మరణతో గడిపేవాడినని తెలిపారు. ఆ సినిమాతో శ్రీ వేంకటేశ్వస్వామిపై ఎనలేని భక్తిభావం పెరిగిందన్నారు. అన్నమయ్య సినిమా చూసిన అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ తనను ఢిల్లీ పిలిపించుకుని కలిసి టిఫిన్ చేశారన్నారు. తనను ఘనంగా సత్కరించి పంపించారన్నారు. అది సినిమా పరిశ్రమలో ప్రత్యేకత సంతరించుకునేలా చేసిందన్నారు. సినిమా పరిశ్రమలో ఎలాంటి సపోర్టు లేదన్నారు. పన్నెండేళ్ల వయసులో నేర్చుకున్న కరాటే కష్ట సమయంలో ఆత్మస్థైర్యం అందించిందన్నారు. శివుడు, శ్రీవేంకటేశ్వస్వామిని పూజిస్తానన్నారు. ఇక్కడికి రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శివశక్తి క్షేత్రం భూగర్భంలో గల శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ధర్మకర్త, వేదపండితులు సుమన్‌ను ఘనంగా సత్కరించారు. సుమన్‌ను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఆయన వెంట నర్సీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు, వినాయక ఆలయ కమిటీ చైర్మన్ దేవత సురేష్, అరుణ, వర్ధమాన నటులు సతీష్, రామ తదితరులు పాల్గొన్నారు.